# చరితార్థులు గురుశ్రీ కాటా రాజులు



**దేవుని ప్రణాళిక పట్టికలో మనమంతా సభ్యులం. మనలో ప్రతి ఒక్కరికి ఒక్కో పని అప్పగించబడి ఉంది. మనం సమర్థవంతంగా కార్యనిర్వహణకు కంకణబద్ధులమై ఉంటున్నామా లేదా అన్నది మన అంతరాత్మ చెప్పాల్సిన  సమాధానం.  దైవపిలుపును విని, దైవాంకిత జీవితాన్ని స్వీకరించి, దైవమానవ సేవలో తరించిన ధన్యజీవులెందరో ఉన్నారు. వాళ్ళంతా చిరస్మరణీయులు, చిద్విలాసులు, పరోపకార సహృదయులు. ఈ కోవలోకి చెందిన వారే హైద్రాబాదు అగ్రపీఠానికి చెందిన గురుశ్రీ కాటా రాజులు. వీరు జర్మనీ దేశంలో ఉంటూ తన పర బేధం లేకుండా తెలుగునాట పలు స్వచ్ఛంద సేవాకార్యక్రమాలు చేస్తూ దీనజన హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.**

విద్య, వైద్య, ఆరోగ్య, సాంఘిక సేవాకార్యక్రమాల ద్వారా విరివిగా సహాయాన్నందిస్తూ బీదసాదలకు పెద్దదిక్కుగా నిలుస్తున్నారు. దైవాంకిత పిలుపులందుకొనే గురు విద్యార్థులకు, మఠవాసకన్యలకు చేయూతనందిస్తూ ప్రోత్సాహకారిగా నిలుస్తున్నారు.

**విద్యకు పెద్దపీట :** సమస్త రుగ్మతలకు మందు చదువే అన్నట్లు విద్యావిషయక కార్యక్రమాలపై విశేష దృష్టిపెట్టి విద్యాసేవ చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, అనాజిపురంలో స్థాపించిన “దివ్యబాల ఎడ్యుకేషనల్ సొసైటీ” ద్వారా దివ్యబాల ఆశ్రమ పాఠశాలను స్థాపించి, బీద బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. కులమతాలకు అతీతంగా ఆర్థిక అసమానతలను తొలగించడానికి తనవంతు కృషి చేస్తున్నారు. విద్వన్మణులను తయారుచేసి జాతి సంపదగా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలలో వీరి సేవ, దాతృత్వాన్ని తెలిసిన గురువులు, మఠకన్యల అభ్యర్థనతో అవసరతలోనున్న వారికి సహాయాన్ని చేస్తూ ఆదుకుంటున్న దయార్థ హృదయులు.

**దేవాలయ నిర్మాణాలకు సహాయం :** దైవసేవకు అంకితమైన తమ జీవితాన్ని సంఘ శ్రేయస్సుకు, సమజాభివృద్ధికి పంచుతున్న వీరు ఆధ్యాత్మిక సేవా కేంద్రాలైన దేవాలయాల నిర్మాణానికి ఇతోధిక ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పలు నూతన దేవాలయాల నిర్మాణాలకు ఆర్థిక సహాయం చేస్తున్నారు. తన వంతు గురుతర బాధ్యతను నిర్వహిస్తూ సుందరమైన దేవాలయాలు రూపుదిద్దుకోడానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

**సున్నిత స్వభావి :** నమ్ముకున్న దేవుని ఆజ్ఞానువర్తిగా, శుభసందేశాలకు క్రియారూపాన్నిస్తూ క్రీస్తు ప్రభు విలువలను చాటుతూ అలుపెరుగక ముందుకు సాగుతున్న గురుశ్రీ కాటా రాజులుగారు అభిజాత్యాలకు పోకుండా అందరితో కలివిడిగా ఉండే మృధుస్వభావి. అందుకేనేమో సమస్య చిన్నదైనా, పెద్దదైన వెంటనే స్పందిస్తారు. కన్నీరు తుడిచి ఓదార్చుతారు. నేనున్నానంటూ అభయమిస్తారు. ఆపదలో ఆదుకుంటారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనాలెన్నో ఉన్నాయి. కోవిద్ - 19 విపత్తు వల్ల లాక్ డౌన్ లో అన్ని సంస్థలతోపాటు వారి విద్యా సంస్థ కూడా మూతపడింది. యావత్తు ప్రయివేట్ ఉపాధ్యాయ సిబ్బంది రోడ్డునపడ్డారు. కానీ “దివ్యబాల ఎడ్యుకేషనల్ సొసైటీ” లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది మాత్రం పూర్తి వేతనాలను అందుకున్నారు. పేద పిల్లలకు అందవలసిన ఆర్థిక సహాయం ఆగలేదు. తనను నమ్ముకున్న వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాలేదు.

**ప్రభూ! నీ సేవకుని చేయి విడువకు :** దేవుని అనుగ్రహం, హైదరాబాద్ అగ్రపీఠం ఆదరణతో జర్మనీ చేరుకున్న గురుశ్రీ కాటా రాజులు గారు సార్ధక నామధేయులు. పేరులో రాజసం, అధినాయకత్వంపై సంపూర్ణ విధేయత, మనసు నిండా సేవకతత్వం, మాటలలో మృదుత్వం, సాధించడంలో పట్టువీడని గుణం, దొరికిన ఆదరణ అందరికి సమానంగా పంచే తత్త్వం ఆయనకు మాత్రమే సొంతం. అందుకే దాతలను ఒప్పించారు, అధినాయకత్వాన్ని మెప్పించారు, పేదల గుండెల్లో దీపమయ్యారు. తెలుగు కతోలిక శ్రీసభకు చెరగని సంపదయ్యారు. అందుకే ప్రభూ... నీ ప్రియ సేవకుని చేయి విడువకు. సేవాగుణాన్ని అంతకంతకు పెంచు. నీ నిండు దీవెనల వర్షాన్ని కురిపించు. అయన తలపెట్టిన ప్రతి పనిలో విజయాన్ని ప్రసాదించు. దీనజన సేవలో నిన్ను చూచుకొని తరించనీ. అందుకు కావల సిన చక్కని ఆయురారోగ్యాలను ప్రసాదించి నడిపించు. నూరంతలుగా ఫలించనీ.. .నుఋనూర్ల మంది దరిచేరనీ... నీ నామ ఘనతను చాటనిమ్మని... నీ కృపను, కాపుదలను అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు

**దివ్య బాలయేసు ఎడ్యుకేషనల్ సొసైటి సభ్యులు**

మరియు **శ్రేయోభిలాషులు**

**(గురుశ్రీ కాటా రాజులు గారి మొబైల్ నెం.: +49 175 7010636)**

